క్లుప్తంగా

రమణ సేవలు మరువలేనివి



సీఆర్‌పీ రమణను సన్మానిస్తున్న ఎంఈఓ జాఫర్ సాదిక్

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లె కాంప్లెక్స్‌లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహిస్తూ చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధికి బదిలీ అయిన ఎం.రమణ అందించిన సేవలు మరువలేనివని మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాదిక్ అన్నారు. సోమవారం మండల రీసోర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు భద్రాచలం, బాషా, ప్రసాద్ శర్మ, ఎంఐసీ కో ఆర్డినేటర్ రోశిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : లింగాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో మూడవ విడత ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ శాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు లింగాల ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని ఆయన కోరారు.

అంధులకు అన్నదానం



అంధులకు భోజనం వడ్డిస్తున్న ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న వీరనారాయణస్వామి అంధుల ఆశ్రమంలో వేముల గ్రామానికి చెందిన దివంగత ఈశ్వరమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు గంగాధర యాదవ్, ఆంజనేయులు ఆధ్వర్యంలో అంధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగేశ్వరమ్మ, కుటుంబ సభ్యులు మస్తానయ్య బండి గంగయ్య, అఖిలేష్, ఆటో షామీర్ తదితరులు పాల్గొన్నారు.

అటెండెన్స్ ప్రకారమే జీతాలు

సింహాద్రిపురం : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సింహాద్రిపురం మండల పరిధిలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు ఆగస్టు నెల జీతాలు ఉదయం, సాయంత్రం అటెండెన్స్ ప్రకారం మాత్రమే చెల్లిస్తామని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం అటెండెన్స్ ఉండేలా చూసుకోవాలన్నారు. లేకుంటే పనిచేసే దినానికి మాత్రమే జీతం తీసుకోవాల్సి వస్తుందన్నారు.

నేడు చెన్నూరుకు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు చెన్నూరులోని మూడవ సచివాలయంలో జరిగే కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చెన్నూరు మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు , అభిమానులు, గ్రామసచివాయ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం మూడవ విడత నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎర్రగుంట్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. ఈ నెల 30వ తేదీన ఉదయం ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

ప్రతి పంటకు ఈ-క్రాప్ బుకింగ్ చేయాలి



ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ రమేష్, తదితరులు

లింగాల : రైతులు సాగు చేసిన ప్రతి పంటకు ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని వ్యవసాయాధికారి రమేష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కామసముద్రం, పెద్దకుడాల రైతు భరోసా కేంద్రాలలో జరుగుతున్న ఖరీఫ్-2023 పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు కూడా ఆర్‌బీకే సిబ్బందిని కలిసి పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, వీఆర్ఏలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే సీఎం లక్ష్యం



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలో అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు పి. నరేన్ రామాంజులరెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని పంచాయతీ పరిధిలో గల ప్రకాశంపల్లి, కొప్పర్తి శివాజీ నగర్ గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం, మతం, పార్టీలు, వర్గాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమం , అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి, కో-కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు కోకటం లక్ష్మీ నారాయణరెడ్డి, సురేంద్రారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ట వేడుకలు



ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు

వేముల : మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్థంభ వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. వేద పండితుడు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను, ధ్వజ స్థంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం వేద పండితులు సీతారాముల కల్యాణాన్ని కనుల పండువలా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించారు. అనంతరం రాత్రి గయోపాఖ్యానం, చింతామణి నాటకం, రామాంజనేయ యుద్ధ సీను, అడవి సీను, హరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠలో వైఎస్సార్‌సీపీ నేతలు

మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో సోమవారం జరిగిన సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలలో వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, కొండారెడ్డిలు శాలువాలతో సత్కరించారు. అలాగే పీబీసీ ఈఈ రాజశేఖర్, డీఈ సత్యవిజయ, జేఈలు శ్రీకాంత్‌రెడ్డి, యశోద స్వామివారిని దర్శించుకున్నారు.

పంట నమోదు కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలి



పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి రైతులు సాగు చేసిన పంట నమోదు కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని అలిదెన, పాయసంపల్లె గ్రామాల్లో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో ఉన్న ప్రతి పంటను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. పంట నమోదు ఆధారంగానే పంటల బీమా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ, పంట రుణాలు వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులను ఆదుకోవడం అందరి బాధ్యత



అనాథ వృద్ధుడికి దుస్తులు అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

వేంపల్లె : ప్రస్తుత సమాజంలో అనాథ వృద్ధులను ఆదుకోవడం అందరి బాధ్యత అని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల్పుల గ్రామంలో అనాథగా తిరుగుతున్న వృద్ధుడిని గుర్తించి వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీ వృద్ధాశ్రమంలో చేర్పించామన్నారు. మానవత సంస్థ ప్రతినిధి కావలి కృష్ణతేజ తన పుట్టిన రోజు సందర్భంగా సొంత డబ్బులతో ఆ వృద్ధుడికి అవసరమైన దుస్తులు, ఇతర వస్తువులు అందజేశారన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండి సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు రఘునాథ్, బాలాజి, శ్రావణ్‌కుమార్, అరుణ, గోపి, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



పులివెందులలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అర్బన్ సీఐ రాజు, తదితరులు

పులివెందుల : ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అర్బన్ సీఐ రాజు సూచించారు. సోమవారం సాయంత్రం ప్రజల భద్రత, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అర్బన్ సీఐతో పాటు ట్రాఫిక్ ఎస్ఐ హాజివలీ పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ నుంచి ఓల్డ్ ఆర్టీసీ సర్కిల్ వరకు ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ ట్రాఫిక్ నియంత్రణ చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఐలాండ్ పాయింట్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న షాపు యాజనులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్ స్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దిశ యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అర్బన్ ఎస్ఐ హుస్సేన్

పులివెందుల టౌన్ : సమాజంలో మహిళల రక్షణకు దిశ యాప్‌ను ప్రవేశపెట్టారని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎస్ఐ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థినులకు దిశ యాప్, పోలీసు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్ఐ హాజరై మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరిగే అకృత్యాలను అరికట్టడానికి దిశ యాప్ ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న సైబర్ క్రైం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే డయల్ 100 గురించి కూడా తెలియజేశారు. అనంతరం మహిళా పోలీసులు మానస, అనూషలు విద్యార్థినుల మొబైల్స్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధీర, పీఆర్ఓ బాలనారాయణ, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అవసరాలకు అనుగుణంగా ఎల్ఐసీ పాలసీ



జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌డీఎం గిరిధర్

కడప కల్చరల్ : సమాజంలో ప్రతి కుటుంబానికి వేర్వేరు ఆర్థిక అవసరాలు ఉంటాయని, అందుకు అనుగుణమైన పాలసీలను అందించడం జీవిత బీమా సంస్థ విశిష్టత అని సంస్థ కడప డివిజన్ ఎస్‌డీఎం కె.గిరిధర్ అన్నారు. స్థానిక డివిజనల్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎల్ఐసీ ప్రచార రథాన్ని ఆయన మార్కెటింగ్ మేనేజర్ శ్యాం సుందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఎల్ఐసీ అందించే బీమా పథకాలను, చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ డివిజన్ పరిధిలో కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో 10 రథాలు ఈరోజు నుంచి తిరుగుతాయని తెలిపారు. బీమా సదుపాయాలు, నూతన పథకాలకు సంబంధించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. కడప డివిజన్‌లో ధనవృద్ధి, జీవన్ కిరణ్ పాలసీలకు మంచి స్పందన లభిస్తోందన్నారు. కడప డివిజన్ బీమా వ్యాపారంలో రికార్డు సృష్టిస్తోందన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ సేవలు

వల్లూరు : మండలంలోని దిగువపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జుబేదా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దిగువపల్లె గ్రామ సచివాలయంలో ఈ నెల 22 నుంచి 25 వ తేదీ వరకు మొబైల్ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 22న దిగువపల్లె, 23న పైడికాలువ, 24న లేబాక, 25న దుగ్గాయపల్లె గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు ఈ కేంద్రంలో ఆధార్ సేవలను అందిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

వేంపల్లె : స్థానిక కందుల ఐటీఐ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్లకు పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రసాదరావు తెలిపారు. ఈనెల 31వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులు ఐటీఐలో ఇవ్వాలన్నారు.

ఏఐటీఎస్‌లో నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్(అటానమస్) కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా అమెజాన్ వెబ్ సర్వీసెస్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే అంశంపై వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీసీటీఈ చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బుద్దా చంద్రశేఖర్ హాజరవుతారన్నారు.

రేపు క్రైస్తవుల శాంతి ర్యాలీ

కడప కల్చరల్ : మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాలు, అల్లర్లు, హింసాకాండలు సమసి పోవాలని, ఆ ప్రాంతంలో శాంతి, సంతోషం వెల్లివిరియాలని కోరుతూ నగరంలోని క్రైస్తవులందరితో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆరోగ్య మాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాద్ రావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23న సాయంత్రం శాంతియుతంగా జరిగే నిరసన ర్యాలీలో క్రైస్తవులతో పాటు మానవతా వాదులైన ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఎస్ఐ సెంట్రల్ చర్చి నుంచి శాంతి ర్యాలీ ప్రారంభమై కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, కలెక్టరేట్ సర్కిల్ మీదుగా తిరిగి మళ్లీ సిఎస్ఐ చర్చి వద్దకు చేరుతుందని, అక్కడ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, ఫాదర్ బాల సుందరం పాల్గొన్నారు.

జాతీయ సదస్సును జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న విజయవాడలో జరిగే జాతీయ సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కడపలోని స్థానిక కార్యాలయంలో సదస్సు కరపత్రాలను డీవైఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగం - పరిష్కార మార్గాలు అనే అంశంపై ఈ సదస్సు ఉంటుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఇప్పటి వరకు ఉద్యోగాలు కల్పించకపోగా, ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ,అంబానీలకు దోచిపెడుతున్నారన్నారు. విజయవాడలోని మాకినేని బసవ పుణ్య విగ్నాన కేంద్రంలో జరిగే జాతీయ సదస్సులో రాజ్యసభ సభ్యులు డీవైఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షుడు రహీం, శాసనమండలి సభ్యుడు ఐ.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవిద్రాజు, నగర అధ్యక్ష కార్యదర్శులు షాకీర్, డీఎం ఓబులేసు పాల్గొన్నారు.

నిబంధనలను పాటించని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ప్రభుత్వ నిబంధనలను పాటించని జూనియర్ కళాశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఆర్ఐవో రమణరాజును కడపలోని తమ కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని ఓ బాలికల జూనియర్ కళాశాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించకుండా అధిక రుసుము వసూలు చేస్తున్నారన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి వెలుగు



ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించుకుంటున్న ప్రజలు

ఎర్రగుంట్ల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరి ఆ ఇంటిలో వెలుగు ప్రసరించిందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం నిడిజివ్వి గ్రామంలో ప్రజాదర్బార్‌లో ఆయనను జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. వలంటరీ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటికే పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

గండి గోశాల పనులు త్వరగా పూర్తి చేయాలి



గండి సమీపంలో గోశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి అనుసంధానంగా నిర్మింప తలపెట్టిన గోశాల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పులివెందుల ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గండిక్షేత్రానికి సమీపంలోని అద్దాలమర్రి క్రాస్ వద్ద ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, రవికుమార్‌రెడ్డిల వినతి మేరకు జిల్లా కలెక్టర్ గోశాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని చక్రాయపేట తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అద్దాలమర్రి క్రాస్ వద్ద 4.5 ఎకరాల స్థలం గోశాలకు కేటాయించడంతో అక్కడ పాడా నిధులతో పశువుల కోసం షెడ్లు, ప్రహరీ, పాపాఘ్ని నదిలో ఫిల్టర్ తదితర పనులకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజా రమేష్, వేదపారాయణం రామమోహనశర్మలు ఆయనచే పూజా కార్యక్రమం చేయించారు. ఆయన మాట్లాడుతూ గండి ఆలయ నిర్మాణ పనులు కూడా త్వరితగతిన పూర్తవ్వాలని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, పాలక మండలి సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ స్థానిక సర్పంచ్ నరసింహులు, ఎంపీటీసీ సభ్యురాలు శాంతమ్మ, తహసీల్దార్ రాజసింహనరేంద్ర, ఎంపీడీఓ శివారెడ్డి, వేంపల్లె జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ రెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ ఓబుళరెడ్డి, పాలకమండలి సభ్యులు రామాంజులరెడ్డి, అంకాల్‌రెడ్డి, అనూషతేజతో పాటు పెద్ద ఎత్తున పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి



ప్రజల సమస్యలపై చర్చిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికి అన్ని మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని భాకరాపురంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా దినేష్ మెడికల్ సెంటర్ వద్ద నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న ఇళ్ల యజమానులు నీటి సరఫరా పైపులైన్ వేయాలని కోరగా.. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి..

హోటళ్లకు వచ్చే కస్టమర్లకు నాణ్యమైన ఆహారం అందించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు హోటళ్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లను శుభ్రంగా ఉంచడంతోపాటు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. అలాగే ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడకం కానీ, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకం కానీ చేయరాదన్నారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులను సకాలంలో చెల్లించాలి

మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీరామ హాలు రోడ్డులో ఉన్న పన్నుల వసూలు కౌంటర్‌ను మూసి వేసి యథావిధిగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అలాగే ప్రజలు తమ పరిధిలోని సచివాలయాల్లో కూడా వివిధ రకాల పన్నులు చెల్లించవచ్చన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతి కోసం పాటుపడాలి



ప్రపంచ శాంతి ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అర్బన్ సీఐ రాజు

పులివెందుల టౌన్ : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతి కోసం పాటుపడాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అర్బన్ సీఐ రాజు పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ మాసంలో భాగంగా పులివెందుల పట్టణంలో మానవత సంస్థ ప్రతినిధులు ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించారు. సోమవారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో ప్రపంచ శాంతిని కోరుతూ విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం పూలంగళ్ల సర్కిల్‌లో ఉన్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, మానవత సంస్థ చైర్మన్ కొండారెడ్డి, మానవత సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, చంద్రశేఖరరెడ్డి, కోశాధికారి హరిశ్చంద్రారెడ్డి, డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మనిషిలో మానవత్వం పెంపొందించాలి



మానవహారం నిర్మించిన మానవత సేవా సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

చెన్నూరు : మనుషులలో మానవత్వం తగ్గిపోయిన ఈ రోజులలో తిరిగి వారిలో మానవత్వం పెంపొందించే దిశగా మానవత సేవా సంస్థ పనిచేస్తుందని మానవత సేవా సంస్థ అధ్యక్షుడు జీఎస్ భాస్కర్ రెడ్డి అన్నారు. మానవత సేవా సంస్థ కమిటీ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులతో కలసి చెన్నూరులో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సాటి మనిషికి సహాయం చేసే దిశగా పనిచేస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే మానవ సంబంధాలు, పెద్దల పట్ల గౌరవ మర్యాదలు, పర్యావరణంపై అవగాహన కలిగించడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ మహమ్మద్ పఠాన్ అలీఖాన్, ఎంపీడీఓ సురేష్ బాబు, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల మానవత సేవ సంస్థ శాశ్వత అధ్యక్షుడు జయభారత్ రెడ్డి, ఆవుల బసిరెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామ్మూర్తి, శ్రీనివాసరాజు, రామాంజనేయ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, రెడ్డిప్రసాద్, బాబు, కుమార్ రెడ్డి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిశీలించి న్యాయం చేస్తాం



ఆర్టీసీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో పని చేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగుల సమస్యలను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు చైర్మన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.9.2014కు ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగుల జీవనభృతిని రూ. 8 వేలు ఇవ్వాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు కోరారన్నారు. ఈ విషయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికెళ్లి తగిన న్యాయం చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి, రాజేంద్రప్రసాద్, శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులనూ పర్మినెంట్ చేయాలి

కడప కార్పొరేషన్ : కాంట్రాక్టు కార్మికులతో పాటు ఔట్ సోర్సింగ్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా, నగర అధ్యక్షుడు కె. తిరుపాల్, ఎస్. రవి డిమాండ్ చేశారు. సోమవారం నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు రూ.18500 వేతనం ఇవ్వాలని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు. కోవిడ్‌లో పనిచేస్తూ మరణించిన కార్మికులకు రూ.50లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్, ఎస్. కిరణ్, ఇమ్మానియేలు, ఆదాము, జి. రవి, శివ, నాగరాజు పాల్గొన్నారు.